

ఖాదీ మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

## నిట్‌లో ఖాదీ మహోత్సవం

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 31: ఖాదీ మహోత్సవంలో భాగంగా నిట్‌లో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి ప్రారంభించారు. ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ) తెలంగాణ రాష్ట్ర కార్యాలయంతో కలిసి ఒక రోజు మినీ-ఎగ్జిబిషన్‌ను నిర్వహించింది. ఖాదీ, గ్రామ పరిశ్రమలు(తేనె, కుండల ప్రదర్శన, తోలు, రెడీమేడ్ వస్త్రాలు), చేనేత, హస్తకళలు తదితర ఉత్పత్తులను 12 స్టాళ్లలో ప్రదర్శించారు. ఎగ్జిబిషన్ వేదిక వద్ద ప్రదర్శించిన చరఖా, కుండల ప్రదర్శనను విద్యార్థులు, సిబ్బంది తిలకించారు. ఖాదీ, దాని ఔచిత్యంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, కేవీఐసీ డైరెక్టర్ డాక్టర్ మనోజ్ లంక 'ఖాదీ ఫర్ నేషన్, ఖాదీ ఫర్ ఫ్యాషన్' అనే సందేశంతో జాతీయ గర్వం, ఫ్యాషన్‌కు చిహ్నంగా ఆదరించాలని విద్యార్థులు, యువతను కోరారు. ఖాదీ మహోత్సవ్ ఆధ్వర్యంలో 'వోకల్ ఫర్ లోకల్', 'ఆత్మనిర్భర్ భారత్' జరుపుకొనేందుకు నిట్ విద్యార్థులు, సిబ్బందికి స్థిరమైన, పర్యావరణ అనుకూలమైన, చేతితో నేసిన వస్త్రం ధరించేలా అధికారులు ప్రేరేపించారు. అన్ని ఖాదీ విక్రయ కేంద్రాల్లో డిజిటలైజ్డ్ చెల్లింపులు కూడా అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఒక్కరూ ఖాదీ ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని ఖాదీ, గ్రామ పరిశ్రమల కమిషన్ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ మనోజ్ లంక కోరారు.

## ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

శాయంపేట, అక్టోబర్ 31: భర్తను మద్యం తాగొద్దన్నందుకు గొడవపడడంతో మనస్తాపానికి గురైన భార్య ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మాందారిపేట గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్సై దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లోకలబోయిన నాగరాజు ఏ పని చేయకుండా మద్యం తాగి భార్య జ్యోతితో గొడవ పడేవాడు. మంగళవారం కూడా గొడవపడి బయటకు వెళ్లాడు. మనస్తాపానికి గురైన జ్యోతి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి నలుగురు పిల్లలు ఉన్నారు. జ్యోతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పత్తి ధర@రూ.7160

కాశీబుగ్గ, అక్టోబర్31: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధర క్వింటాకు రూ.7160 ధర పలికింది. ప్రభుత్వ మద్దతు ధర రూ.7020 ఉండగా, మంగళవారం అత్యధికంగా పలికింది. వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని తిరుమలాయపల్లి గ్రామానికి చెందిన పరుపాటి సురేందర్‌రెడ్డి 15 పత్తి బస్తాలు తీసుకువచ్చాడు. ఈశ్వర్ ఎంటర్‌ప్రైజెస్ అడ్తి ద్వారా గణపతిసాయి ట్రేడర్స్ కరీదు వ్యాపారి కొనుగోలు చేశాడు. మంగళవారం మార్కెట్‌కు 3352 క్వింటాళ్లు వచ్చినట్లు పత్తి యార్డు సూపర్‌వైజర్ గంగాధర్ తెలిపారు. అత్యధికంగా క్వింటా పత్తికి రూ.7160, మధ్య రకం, రూ.6800, కనిష్ఠంగా రూ.5000 పలికినట్లు తెలిపారు.



మార్కెట్‌కు వచ్చిన పత్తి

## రామప్ప విశిష్టతపై సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలి

**రాష్ట్ర పర్యాటక ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్**

ములుగుటౌన్, అక్టోబర్31: యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప విశిష్టతను తెలుపుతూ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి పాలంపేట వరకు సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర పర్యాటక ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ పర్యాటక శాఖ అధికారులకు సూచించారు. యునెస్కోకు పంపాల్సిన తుది నివేదికలో పొందుపరచాల్సిన అంశాలపై మంగళవారం రాష్ట్రస్థాయి అధికారులతో ఆన్‌లైన్ మీటింగ్ నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ రామప్ప చుట్టూ బౌండరీ పెంచడానికి పాలంపేట స్పెషల్ డెవలప్‌మెంట్ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పర్యాటశాఖ ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి ప్రణాళిక కోసం నవంబర్ 30 లోగా ప్రతిపాదనలు సమర్పిస్తామని టూరిజం ఎండీ మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారు కామేశ్వరాలయ పునరుద్ధరణకు సంబంధించిన నివేదికను అందజేయాల్సిందిగా కోరగా కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధి కంపారిటివ్ స్టడీ రిపోర్టు డిసెంబర్ 31లోపు పూర్తి చేస్తామని తెలిపారు. పురావస్తు శాఖ అధికారి నారాయణ, టౌన్ ప్లానింగ్ అధికారి దేవేందర్ పాల్గొన్నారు.

# వేర్వేరు చోట్ల గంజాయి పట్టివేత

- **కాజీపేటలో 14.50 కిలోలు, జనగామలో పది, ఏటూరునాగారంలో 5 కిలోల సరుకు స్వాధీనం**
- **నలుగురిపై కేసు నమోదు**

కాజీపేట, అక్టోబర్ 31: కాజీపేట రైల్వే జంక్షన్‌లో ప్లాట్‌ఫాంపై మంగళవారం ఎక్సైజ్ పోలీసులు తనిఖీ చేసి పద్నాలుగున్నర కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైల్వే జంక్షన్‌లో ఎక్సైజ్ సిబ్బంది తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఓ వ్యక్తి బ్యాగుతో కనిపించాడు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకుని తనిఖీ చేయగా పద్నాలుగున్నర కిలోల గంజాయి బయట పడింది. నిందితుడిని విచారించగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన తన పేరు రాధే శ్యాం అని, అధిక డబ్బులకు ఆశ పడి కొంతకాలంగా గంజాయిని రవాణా చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తి విజయవాడలో బ్యాగును అప్పగించి ఖరగ్‌పూర్‌లో అప్పగించాలని చెప్పాడని పేర్కొన్నాడు. కాజీపేటలో రాత్రి దిగి ఖరగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు కోసం వేచి ఉన్నట్లు చెప్పాడు. నిందితుడిపై మాదక ద్రవ్యాల రవాణా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ చెప్పారు. ఈ తనిఖీల్లో కాజీపేట ఎక్సైజ్ ఎస్సై లు తిరుపతి, సౌమ్య, హెడ్ కానిస్టేబుళ్లు ఖలీల్, కోటిలింగం, వీరమల్లు, రషీద్, లాలయ్య, వెంకటరమణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

**పది కిలోల ఎండు గంజాయి పట్టివేత**

జనగామ చౌరస్తా: జనగామ రైల్వే స్టేషన్ వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో పది కిలోల ఎండు గంజాయి పార్సిల్‌ను తరలిస్తూ బీహార్‌కు చెందిన శంకర్‌కుమార్ యాదవ్ పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ బీ ప్రభావతి తెలిపారు. నిందితుడిని జిల్లా కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ. 2.50 లక్షల వరకు ఉంటుందన్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సైలు సీహెచ్ జనార్దన్, రాధిక, సిబ్బంది ఖలీల్, శ్రావణ్, సోమేశ్వర్ పాల్గొన్నారు.

**ద్విచక్రవాహనంపై తరలిస్తూ..**

ఏటూరునాగారం: మండలంలోని దొడ్ల కొత్తూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు సీఐ రాజు, ఎస్సై కృష్ణ ప్రసాద్ వివరాలు వెల్లడించారు. మంగళవారం ఏటూరునాగారంలోని అటవీ శాఖ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా బైక్ వస్తున్న భూ క్యా మహేశ్, ఇస్లావత్ లక్ష్మణ్ వద్ద రెండు, మూడు కేజీల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. విచారించగా గంజాయిని విక్రయించేందుకు ఒడిశాలోని మల్కాన్‌గిరి నుంచి తీసుకువస్తున్నట్లు చెప్పారు. ఇద్దరిపై కేసు నమో దు చేయడంతోపాటు బైక్‌ను సీజ్ చేసినట్లు సీఐ, ఎస్సైలు తెలిపారు.




కాజీపేటలో నిందితుడిని అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

## ఆర్థిక ఇబ్బందులతో రైలు కిందపడి ఆత్మహత్య

ఖిలావరంగల్, అక్టోబర్ 31: ఆర్థిక ఇబ్బందులతో జీవితం మీద విరక్తి చెందిన ఒకరు మంగళవారం రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్పీ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కాశీబుగ్గ వివేకానందకాలనీకి చెందిన మాటేటి మల్లికార్జున్(45) కూలి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. వ్యక్తిగత కారణాలతోపాటు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో జీవితం మీద విరక్తి కలిగి వరంగల్ రైల్వేస్టేషన్‌లోని బీ క్యాబిన్ ఎదురుగా గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎంజీఎం దవాఖానకు తరలించినట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.



మల్లికార్జున్(ఫైల్)

## గుండెపోటుతో పెరోల్ ఖైదీ మృతి

కురవి, అక్టోబర్ 31: హత్య కేసులో జీవితఖైదు అనుభవిస్తున్న ఉబ్బని వీరన్న(40) గుండెపోటుతో మృతి చెందిన ఘటన కురవి మండలం నల్లెల్ల గ్రామంలో చోటుచేసుకుంది. సీరోలు ఎస్సై రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వీరన్న 2007వ సంవత్సరంలో తల్లి, అన్నను మద్యం మత్తులో హత్య చేశాడు. ఈ కేసులో 2008లో జీవిత ఖైదు పడగా, చర్లపల్లి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ నెల 18వ తేదీన పెరోల్‌పై విడుదలై గ్రామానికి వచ్చి తన ఇంటి వద్ద చిన్నమ్మతో ఉంటున్నాడు. మంగళవారం వీరన్న ఛాతిలో నొప్పి వస్తుందని బాధపడుతూ చనిపోయినట్లు మృతుడి అక్క దోమల వెంకటమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. శవపంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించినట్లు తెలిపారు.



ఉబ్బని వీరన్న(ఫైల్)

## వివాహేతర సంబంధమే హత్యకు కారణం

**మిస్టరీని ఛేదించిన పోలీసులు**

గూడూరు, అక్టోబర్31: తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని తల్లి హచ్చాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తులో హత్యగా గుర్తించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో సీఐ ఫణిధర్ వివరాలు వెల్లడించారు. మండలంలోని దుబ్బగూడెం గ్రామంలో గత నెల 24న అజ్మీరా రవి తన వ్యవసాయ పొలంలో విద్యుత్ షాక్‌తో చనిపోయాడు. అందరూ అలానే భావించగా, మృతుడి తల్లి తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని అనుమానాస్పద మృతిగా భావించి విచారణ చేపట్టారు. విచారణలో మృతుడి భార్య కవిత, అదేగ్రామంలో వరుసకు మరిది అయిన అజ్మీరా శివతో ఏడేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నది. గ్రామస్తులు, పెద్దలు ఎన్ని సార్లు చెప్పినా వినలేదు. తమ వివాహేతర సంబంధానికి భర్త అడ్డు వస్తున్నాడని భావించి గత నెల 23న రవి పొలంలో కవిత, శివ పథకం ప్రకారం విద్యుత్ తీగను భూమి పై అమర్చి విద్యుత్ షాక్ తగిలేలా చేశారు. విషయం తెలియని రవి మరుసటి రోజు తన పొలంలోకి వెళ్లి పనులు చేసుకుంటున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలి చనిపోయాడు. పోలీసుల విచారణలో రవి మృతికి తామే కారణమని నిందితులు తెలిపారని, వీరిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై రాణా ప్రతాప్, పీఎస్సై వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు



పూర్వవిద్యార్థి ప్రొఫెసర్ తిరుపతిని సన్మానిస్తున్న వీసీ రమేశ్

# వర్సిటీ అభివృద్ధికి సహకరించాలి

- **కేయూ వీసీ ప్రొఫెసర్ రమేశ్**

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 31: విశ్వవిద్యాలయ సర్వతోముఖాభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ అన్నారు. యూనివర్సిటీ గణిత శాస్త్ర విభాగ పూర్వవిద్యార్థి, బెంగళూరు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ తిరుపతి గుడి(1999-2001) వీసీ రమేశ్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులతో విశ్వవిద్యాలయ ప్రతిష్ట పెరుగుతోందని అన్నారు. కేయూకు బలమైన పూర్వ విద్యార్థుల సమూహం ఉందన్నారు. అకడమిక్ అంశాల్లో ఇక్కడి విద్యార్థులకు గైడ్‌గా చేయాలని కోరారు. ఈ సందర్భంగా తిరుపతి గుడిని శాలువా, జ్ఞాపికతో వీసీ సన్మానించారు. కార్యక్ర మంలో ప్రొఫెసర్ పీ మల్లారెడ్డి, విశ్రాంత ప్రొఫెసర్ టీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో ఒకరికి ఏడాది జైలు

నర్సింహులపేట, అక్టోబర్ 31: మండలంలోని జగ్గుతండా గ్రామపంచాయతీ పరిధిలోని కొత్త తండాలో దొంగతనం కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్ష విధించినట్లు ఎస్సై జీ. సతీశ్ మంగళవారం తెలిపారు. తండాకు చెందిన బానోత్ కీరు ఇంట్లో బంగారు, వెండి వస్తువులు ఆపహరణకు గురవడంతో పోలీ సులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని విచారణ జరిపి చిన్నగూడూరు మండలం ఇస్సంపల్లికి చెందిన చాగంటి మహేశ్‌ను నిందితుడిగా గుర్తించారు. కోర్టులో చార్జిషీట్ వేయగా ఏడాది జైలుశిక్షతోపాటు రూ. 200 జరిమానా వేసినట్లు తెలిపారు.